క్లుప్తంగా

క్రీడలతో మానసికోల్లాసం



కబడ్డీ పోటీలను ప్రారంభిస్తున్న ఎస్‌ఐ నాగార్జున, మాజీ జెడ్పీటీసీ పుల్యాల నాగిరెడ్డి

పగిడ్యాల: క్రీడలు మానసికోల్లాసాన్ని ఇస్తాయని ముచ్చుమర్రి ఎస్‌ఐ నాగార్జున, మాజీ జెడ్పీటీసీ పుల్యాల నాగిరెడ్డి అన్నారు. మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని శనివారం స్థానిక బంగ్లా కట్ట సర్వేశ్వరస్వామి దేవాలయం వద్ద యాదవ, కురువ సంఘం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఉమ్మడి కర్నూలు జిల్లా కబడ్డీ పోటీలను ప్రారంభించారు. వారు మాట్లాడుతూ జాగరణ వేడుకలలో భాగంగా ప్రతి ఏటా ఫ్లడ్‌లైట్ల వెలుతురులో జిల్లా స్థాయి కబడ్డీ పోటీలను నిర్వహించడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ పెరుమాళ్ల శేషన్న, వైఎస్సార్‌సీపీ నాయకులు పల్లె సత్యనారాయణరెడ్డి, భూషిరెడ్డి, భాస్కర రెడ్డి, కబడ్డీ జాతీయ క్రీడాకారుడు మోక్షంరెడ్డి, యాదవ సంఘం సభ్యులు శెట్టిమాస్ మధు, సింగిల్‌విండో మాజీ డైరెక్టర్ శేషన్న తదితరులు ఉన్నారు.

కస్తూర్బా విద్యార్థినుల ప్రతిభ



చిన్నమ్మను అభినందిస్తున్న పాఠశాల ఎస్‌ఓ, ఉపాధ్యాయులు

జూపాడుబంగ్లా: స్థానిక కస్తూర్బాగాంధీ పాఠశాలకు చెందిన పదోతరగతి విద్యార్థిని చిన్నమ్మ వెయిట్‌లిఫ్టింగ్ జిల్లా, రాష్ట్ర పోటీల్లో రాణిస్తుండటంతో ఎస్‌ఓ యశోద, ఉపాధ్యాయులు శుక్రవారం అభినందించారు. పాఠశాల పీఈటీ నజీమా మాట్లాడుతూ పదోతరగతి విద్యార్థిని కర్నూలులో జరిగిన జిల్లా శాప్ లీగ్ పోటీల్లో మూడోస్థానం, కర్నూలు స్టేడియంలో జరిగిన ఏపీ సీఎం కప్ పోటీల్లో మూడోస్థానం, జగ్గయ్య పేటలో ఈనెల 2 నుంచి 4 వరకు జరిగిన ఎస్‌జీఎఫ్ 66వ రాష్ట్రస్థాయి స్కూల్ గేమ్స్‌లో అండర్ -17 విభాగంలో పాల్గొని ప్రతిభచూపినట్లు తెలిపారు. అలాగే పశ్చిమ గోదావరి జిల్లాలో జరిగిన చెస్ పోటీల్లో పాఠశాల నుంచి గాయత్రి పాల్గొని ప్రతిభ చూపినట్లు తెలిపారు. అలాగే నిఖిత, ద్రాక్షాయణి అనే విద్యార్థినులు నెల్లూరు జిల్లా, ఆత్మకూరులో జరిగిన నెట్‌బాల్ పోటీల్లో పాల్గొని ప్రతిభ చాటినట్లు తెలిపారు.

విద్యుత్ ప్రమాద ఘటనపై కేసు నమోదు

పగిడ్యాల: లక్ష్మాపురం అంచె వద్ద శుక్రవారం జరిగిన విద్యుత్ ప్రమాద ఘటనపై కేసు నమోదు చేసినట్లు ముచ్చుమర్రి ఎస్‌ఐ నాగార్జున శనివారం తెలిపారు. మునగ కాయలు కోసేందుకు వెళ్లి విద్యుత్ ఘాతానికి గురై కొత్త పాలమర్రికి చెందిన కుమ్మరి శివ(22) మృతి చెందిన విషయం పాఠకులకు విధితమే. మృతుడి తండ్రి కుమ్మరి రాజు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని ఎస్‌ఐ వెల్లడించారు. మృతదేహానికి నందికొట్కూరు ప్రభుత్వ ఆసుపత్రిలో పోస్టుమార్టం నిర్వహించి కుటుంబీకులకు అప్పగించామని ఆయన తెలిపారు.

రథానికి పుష్పాలంకరణ



పుష్పాలను అందంగా అలంకరిస్తున్న దేవస్థాన సిబ్బంది

ఆత్మకూరు: శ్రీశైలక్షేత్రంలో మహాశివరాత్రి పర్వదినం సందర్భంగా స్వామివారి సన్నిధిలోని రథాన్ని పుష్పాలంతో ముస్తాబు చేసేందుకు దేవస్థానం నిర్వాహకులు ఏర్పాట్లు చేస్తున్నారు. ఆలయప్రాంగణంలో వివిధ రకాల పుష్పాలను దండలుగాను, వివిధ ఆకృతుల్లో సిద్ధం చేస్తున్నారు. పుష్పాల దండలు పూర్తయితే వాటిని రథాన్ని అలంకరించడంతో పాటు ఆలయప్రాంగణాన్ని అందంగా తీర్చిదిద్దేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు.

వైభవంగా చంద్రమౌళీశ్వర స్వామి కల్యాణం



కల్యాణాన్ని నిర్వహిస్తున్న వేదపండితులు

జూపాడుబంగ్లా: నందికొట్కూరు మండలంలోని కొణిదేల గ్రామంలో శనివారం మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకొని శ్రీహైమావతి, కాశీచంద్రమౌళీశ్వరస్వామి వారి కల్యాణం కనుల పండువగా నిర్వహించారు. అర్చకులు స్వామి, అమ్మవార్ల ఉత్సవ విగ్రహాలకు పంచామృతాభిషేకాలు నిర్వహించి పన్నీటిస్నానం ఆచరింపజేసి పట్టువస్త్రాలతో వధూ,వరులుగా ముస్తాబుచేశారు. పలురకాల పూలతో అందంగా అలంకరించిన కల్యాణ మండపలంలోని పెళ్లిపీటలపై ఆశీనులు గావించారు. వేద పండితుల మంత్రోచ్ఛరణల మధ్య కల్యాణాన్ని జరిపించారు.



క్యూలలో వేచివున్న భక్తులు

శివోహం.. భజేహం!

శ్రీశైలం శివమయం అయ్యింది. క్షేత్ర వీధుల్లో ప్రణవ నాదం ప్రతిధ్వనించింది. మహాశివరాత్రి పర్వదినాన శనివారం శ్రీశైల మల్లన్నను దర్శించుకునేందుకు భారీగా భక్తులు తరలివచ్చారు. పాతాళగంగలో పుణ్యస్నానాలు ఆచరించి స్వామివారి దర్శనానికి బారులు తీరారు. 'ఓం..నమఃశివాయ' అంటూ పంచాక్షరి మంత్రాన్ని జపిస్తూ పరమశివున్ని దర్శించుకున్నారు. బ్రహ్మోత్సవాలను తిలకిస్తూ కర్పూర నీరాజనాలు సమర్పించారు. – శ్రీశైలంటెంపుల్/ఆత్మకూరు



షవర్ల వద్ద పుణ్యస్నానాలాచరిస్తున్న భక్తులు



శివభజనలు చేస్తున్న శివదీక్షాస్వాములు



స్వామివార్ల లడ్డూప్రసాదాల కోసం వేచి ఉన్న భక్తులు



స్టాల్ వద్ద చార్జింగ్‌కి ఉంచిన సెల్‌ఫోన్లు



గంగమ్మకు హారతిస్తున్న భక్తురాలు

హర హర మహాదేవ...శంభో శంకర

- వైభవంగా మహాశివరాత్రి వేడుకలు
- భక్తజనంతో కిటకిటలాడిన మహానంది
- శేష, నందివాహనంపై మహానందీశుడి దంపతులు



మహానందిలో శేషవాహనంపై మహానందీశ్వరస్వామి దంపతులు

మహానంది: మహాశివరాత్రి సందర్భంగా మహానంది ఆలయం శనివారం భక్తజనంతో కిటకిటలాడింది. వేలాది మంది భక్తులు తరలిరావడంతో ఆలయ ప్రాంగణాలు భక్తులతో కళకళలాడాయి. ట్రస్ట్‌బోర్డు చైర్మన్ కొమ్మా మహేశ్వరరెడ్డి, ఈఓ కాపు చంద్రశేఖర్‌రెడ్డి ఆధ్వర్యంలో వేదపండితులు, రుత్వికులు విశేష పూజలు నిర్వహించారు. శ్రీ కామేశ్వరీదేవి, మహానందీశ్వరస్వామి వార్లు ఉదయం శేషవాహనంపై కొలువై భక్తులకు దర్శనమిచ్చారు. రాత్రి నందివాహనంపై ఊరేగారు. వేలాది సంఖ్యలో భక్తుల మధ్య గ్రామోత్సవం కనులపండువగా జరిగింది. ఉదయం నుంచి ప్రారంభమైన స్వామి, అమ్మవార్ల దర్శనం రాత్రి వరకు నిర్విరామంగా కొనసాగింది.

భక్తులసేవలో స్వచ్ఛంద సంస్థలు

స్వచ్ఛంద సంస్థల వారు భక్తులకు సేవలందించడం అభినందనీయమని మహానంది ట్రస్ట్‌బోర్డు చైర్మన్ కొమ్మా మహేశ్వరరెడ్డి, ఈఓ కాపు చంద్రశేఖర్‌రెడ్డి అన్నారు. మహాశివరాత్రి పర్వదినం సందర్భంగా జిందాల్ కంపెనీ ఆధ్వర్యంలో మహానందిలో ఏర్పాటు చేసిన వైద్యశిబిరాన్ని శనివారం ప్రారంభించారు. తిమ్మాపురం పీహెచ్‌సీ వైద్యాధికారి చంద్రశేఖర్, డాక్టర్ రూపేంద్రనాథ్‌రెడ్డి, గాజులపల్లె పీహెచ్‌సీ వైద్యులు శ్రీనివాసులు, డాక్టర్ వెంకటరెడ్డిల ఆధ్వర్యంలో భక్తులకు సేవలందించారు. వీరితో పాటు ఇండియన్ రెడ్‌క్రాస్, ఆర్‌ఎంపీ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వైద్యశిబిరాన్ని తహసీల్దార్ జనార్దన్‌శెట్టి ప్రారంభించారు. వివిధ కులాల వారు భక్తులకు అన్నప్రసాదం పంపిణీ చేశారు.

మహానందిలో ఆకట్టుకున్న కేరళ వాయిద్యం

మహాశివరాత్రి సందర్భంగా శనివారం మహానందిలో నిర్వహించిన కేరళ కళాకారుల డోలు, తాళాల ప్రదర్శనలు భక్తులను ఆకట్టుకున్నాయి. ఈ ఏడాది తొలిసారి ఏర్పాటు చేసిన ప్రదర్శనలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి.

సంగమేశ్వరం, కొలనుభారతిలో ప్రత్యేక పూజలు



సంగమేశ్వరుడి దర్శనానికి క్యూలైన్లలో భక్తులు



కొలనుభారతిదేవికి మహామంగళహారతి

కొత్తపల్లి: ప్రాచీన పుణ్యక్షేత్రాలైన సంగమేశ్వరం, కొలనుభారతిదేవి ఆలయాల్లో మహాశివరాత్రిపర్వదినాన్ని పురస్కరించుకొని శనివారం భక్తులు ప్రత్యేక పూజలు జరుపుకున్నారు. సంగమేశ్వర క్షేత్రంలో ఆలయ పురోహితులు తెలకపల్లి రఘురామ శర్మ వేపదారు శివలింగానికి ప్రాతఃకాలం నుంచే పూలమాలలతో అలంకరించి అభిషేకాది పూజా కార్యక్రమాలు, మహామంగళహారతి, రుద్రాభిషేకం, నదిజలాలతో అభిషేకం వంటి విశేష పూజలు నిర్వహించారు. రెండుతెలుగు రాష్ట్రాల నుంచి జాగరణ కార్యక్రమం చేసుకొనేందుకు అధికసంఖ్యలో భక్తులు సంగమేశ్వరం చేరుకొని సప్తనదుల సంగమ ప్రాంతంలో పుణ్యస్నానాలు ఆచరించి ప్రత్యేక పూజలు చేసుకున్నారు. అదేవిధంగా రాష్ట్రంలోనే ఏకైక సరస్వతి పుణ్యక్షేత్రంగా వీరాజిల్లుతున్న కొలనుభారతి దేవి ఆలయంలో కూడా మహాశివరాత్రి వేడుకలు వైభవంగా జరిగాయి. ఆలయ పురోహితులు శ్రీవాసశర్మ అమ్మవారిని నూతన వస్త్రాలతో అలంకరించారు. అమ్మవారికి ఉదయ కాలంనుంచే అభిషేకాలు, కుంకుమార్చన, పుష్పార్చన, మహామంగళహారతి వంటి విశేషపూజా కార్యక్రమాలు చేశారు. మండలంలోని ఊరూరా ఆలయాల్లో మహాశిరాత్రి పూజలు ఘనంగా జరిగాయి

ఓంకారంలో బ్రహ్మోత్సవాలకు అంకురార్పణ



ఓంకారంలో ఉత్సవ విగ్రహాల ఊరేగింపు

బండిఆత్మకూరు: మహాశివరాత్రి పర్వదినం సందర్భంగా ఓంకారం, కృష్ణనంది, శివనంది క్షేత్రాలకు భక్తులు పెద్ద సంఖ్యలో తరలి వెళ్లారు. ఓంకార క్షేత్రంలో ఈఓ నాగప్రసాద్, ఆలయ చైర్మన్ విశ్వనాథరెడ్డి, ధర్మకర్త నారాయణల ఆధ్వర్యంలో పూజారులు శివరాత్రి బ్రహ్మోత్సవాలకు అంకురార్పణ చేశారు. ఇందులో భాగంగా ఆదిదంపతుల కల్యాణోత్సవానికి సకల దేవతలను ఆహ్వానిస్తూ ధ్వజారోహణ కార్యక్రమం నిర్వహించారు. తర్వాత పుట్టమన్ను తీసుకొని వచ్చి యాగశాలను తయారు చేశారు. భక్తులు పెద్ద సంఖ్యలో రావడంతో క్యూలైన్లు కిక్కిరిశాయి. ఆలయ ప్రాంగణంలో రెడ్‌క్రాస్ సంస్థ ఆధ్వర్యంలో వైద్యశిబిరాన్ని ఏర్పాటు చేశారు. మణికంఠాపురం గ్రామస్తులు ఏర్పాటు చేసిన ప్రభ పలువురిని ఆకట్టుకుంది. ఓంకార క్షేత్రంలో తొలి సారి ప్రభలు ఏర్పాటు చేయడంతో భక్తులు మంత్రముగ్ధులయ్యారు. క్షేత్రానికి వచ్చిన భక్తులకు కాశిరెడ్డినాయన ఆశ్రమ నిర్వాహకులు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో కృష్ణనంది ఈఓ రామాంజనేయ శర్మ, సోమశేఖర్‌రెడ్డి, రాగాల బాబులు, వైస్ చైర్మన్ వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

అనంతపురం జిల్లా వృషభాల జయకేతనం



విజేతలైన ఎద్దుల యజమానులకు నగదు బహుమతులను అందజేస్తున్న చైర్మన్, దాతలు

జూపాడుబంగ్లా: మహాశివరాత్రిని పురస్కరించుకొని నందికొట్కూరు పట్టణంలోని జీవన్‌జ్యోతి స్కూల్ సమీపంలో నిర్వహించిన రాష్ట్రస్థాయి ఎద్దుల బండలాగుడు పోటీలను మున్సిపల్ చైర్మన్ దాసి సుధాకర్‌రెడ్డి ప్రారంభించారు. పోటీల్లో మొత్తం 11జతల ఎద్దులు పోటీపడగా అనంతపురం జిల్లా, చక్రాయపేటకు చెందిన వృషభాలు విజయకేతనం ఎగురవేసి రూ.50వేల నగదును దక్కించుకున్నారు. నెలటూరుకు చెందిన గాజుల కుమారస్వామి వృషభాలు ద్వితీయస్థానంలో రూ.40వేలు, జిల్లెల్లకు చెందిన రవితేజేశ్వరరెడ్డి ఎద్దులు మూడో స్థానంలో నిలిచి రూ.30వేలు కైవసం చేసుకున్నాయి. ఆతరువాతి స్థానాల్లో వరుసగా బైరవాడి లక్ష్మన్న ఎద్దులు రూ.20వేలు, ఓర్వకల్లు నడిపి వెంకటేశ్వర్లు రూ.15వేలు, కొత్తపల్లి దుబ్బన్న వృషభాలు రూ.10వేలు, గుమ్మడం కుమారస్వామి ఎద్లు రూ.8వేలు, సీసంగుంతల లక్ష్మిరెడ్డి భరత్‌చంద్రారెడ్డి ఎద్దులు రూ.6వేలు, పెబ్బేరు బోయిన వెంకటకృష్ణయాదవ్ ఎద్దులు 5వేలు చేజిక్కించుకొన్నాయి. విజేతలకు చైర్మన్ దాసి సుధాకర్‌రెడ్డి, దాతలు బహుమతులు అందజేశారు. కౌన్సిలర్ నాయబ్, జిల్లా శాప్ కోఆర్డినేటర్లు స్వామిదాసు, రవికుమార్, ఎస్‌ఐ ఎస్‌పీ రమణ పాల్గొన్నారు.

రుద్రకోడు క్షేత్రంలో వైభవంగా శివరాత్రి

ఆత్మకూరు: నల్లమల అటవీపరిధిలోని రుద్రకోడు పుణ్యక్షేత్రంలో మహాశివరాత్రి పర్వదినం కనులపండువలా జరిగింది. వేకువజామున స్వామివారికి విశేషపూజలుతో పాటు పంచామృతాభిషేకం, బిల్వార్చన పూజలను నిర్వహించారు. రుద్రాణిఅమ్మవారికి కుంకుమార్చన చేశారు. కోనేరులో పుణ్యస్నానాలాచరించి విశేషపూజలు చేశారు. క్షేత్రంలో రుద్రకోటేశ్వరస్వామికి మహన్యాసపూర్వక రుద్రాభిషేకం నిర్వహించగా, ఎర్రగూడూరు నుంచి ప్రభలు క్షేత్రానికి తరలివచ్చాయి. భక్తుల సౌకర్యార్థం రాత్రి నాటకాలు నిర్వహించారు. ఆర్టీసీ అధికారులు జాగరణ సందర్భంగా ప్రత్యేక బస్సులు ఏర్పాటు చేశారు. మహాశివరాత్రి పర్వదినం సందర్భంగా భక్తులు స్వామివారికి పూజలు నిర్వహించారు. భక్తులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.

వీరభద్రస్వామి దేవాలయంలో ప్రత్యేక పూజలు

నాగలూటి పుణ్యక్షేత్రంలో మహాశివరాత్రి పర్వదినం సందర్భంగా శనివారం వీరభద్రస్వామికి ప్రత్యేకపూజలు నిర్వహించారు. చెంచులు వీరభద్రస్వామికి అర్చనలు, విశేషపూజలు చేశారు. కొందరు కాలినడకన వచ్చే వారికి అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. శ్రీశైలక్షేత్రానికి వచ్చే భక్తులకు ద్వారపాలకులుగా కొలువుతీరిన వీరభద్రస్వామిని భక్తులు పూజలు నిర్వహించి కాలినడకను కొనసాగించడం ఆనవాయితీ.

శివాలయాల్లో ..

ఆత్మకూరు పట్టణంలోని పలు శివాలయాల్లో శివరాత్రి సందర్భంగా శనివారం భక్తులు పూజలు నిర్వహించారు. దేవాలయంలో వెలసిన మహాశివునికి పంచామృతాభిషేకం, అమ్మవారికి కుంకుమార్చనలుతో పాటు వివిధ పూజలు జరిపారు. అన్ని శివాలయాల వద్ద వేకువజాము నుంచి భక్తులు పుణ్యస్నానాలు ఆచరించి స్వామిఅమ్మవార్లను దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు.

భక్తిశ్రద్ధలతో వేడుకలు

వెలుగోడు: మహా శివరాత్రి వేడుకలు మండలంలో భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. శివరాత్రి సందర్భంగా పట్టణ శివారులోని వస్ ఆర్ తూము వద్ద ఉన్న సర్వేశ్వరాలయానికి భక్తులు పోటెత్తారు. ఆలయ ప్రాంగణం శివనామస్మరణతో మార్మోగింది.

ఆలయ ప్రాంగణంలో వీఐపీల తోపులాట

ఆత్మకూరు: మహాశివరాత్రి పర్వదినం సందర్భంగా వెలసిన శ్రీ భ్రమరాంబా మల్లికార్జున స్వామి అమ్మవార్లను దర్శించుకునేందుకు వీఐపీలు పోటీపడ్డారు. మల్లికార్జున స్వామి ఆలయ ప్రాంగణంలోని వీఐపీల గేట్ వద్ద పెద్ద ఎత్తున గుమికూడారు. ఆలయ సిబ్బంది గేట్లు తెరవడంతో ఒక్కసారిగా వారి మధ్య తోపులాట జరిగింది. అప్పటికే రూ.500 టికెట్ తీసుకుని క్యూలో నిరీక్షిస్తున్న భక్తులు, పోలీసు సిబ్బంది నివ్వెరపోయారు.

మారుమోగిన శివనామస్మరణ



శ్రీశంకరమల్లేశ్వర, భ్రమరాంబా అమ్మవారు

జూపాడుబంగ్లా: శివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకొని శివాలయాలు శివనామస్మరణతో మారుమోగాయి. తూడిచెర్ల గ్రామంలో వెలసిన శ్రీ భ్రమరాంబా సమేత శంకరమల్లయ్యస్వామివారికి బిల్వార్చన, పంచామృతాభిషేకం వంటి పూజా కార్యక్రమాలను నిర్వహించారు. తెల్లవారుజామున లింగోద్భవం సందర్భంగా స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం స్వామి, అమ్మవారికి భక్తిశ్రద్ధలతో కళ్యాణ వేడుకలు జరిపించారు. తంగడంచ కాశీవిశ్వేశ్వరాయలంలో, జూపాడుబంగ్లాలోని సిద్ధేశ్వర, భుజంగేశ్వర ఆలయాల్లోని శివాలయాలకు ప్రత్యేక పూజలు చేశారు.

పగిడ్యాల: మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని శనివారం మండలంలోని శివాలయాలు భక్తులతో పోటెత్తాయి. ఆయా గ్రామాల్లోని శివాలయాలల్లో భక్తులు భక్తిశ్రద్ధలతో ప్రత్యేక పూజలు నిర్వహించి భక్తిని చాటుకున్నారు.

నందీశ్వరుడికి పూజలు

పాములపాడు: మహాశివరాత్రి సందర్భంగా భక్తులు శివాలయాలలో తెల్లవారుజామునుంటే పూజలు నిర్వహించారు. మండలంలోని ఇస్కాల గ్రామ సమీపంలో ఉన్న భవనాసి నది వద్ద నిర్మించిన నందీశ్వర ఆలయంలో భక్తులు శనివారం పోటెత్తారు. శివరాత్రి సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులు ఉమ్మడి కర్నూలు, నంద్యాల జిల్లాల నుంచి అధిక సంఖ్యలో చేరుకొని తమ మొక్కులను తీర్చుకున్నారు. భక్తులకు అల్పాహారం, మజ్జిగ, తాగునీటిని దాతులు ఏర్పాటు చేశారు.

మహానందిలో ప్రముఖులు

మహానంది: మహాశివరాత్రి సందర్భంగా మహానందిలో శనివారం పలువురు ప్రముఖులు పూజలు నిర్వహించారు. నంద్యాల జిల్లా రెవెన్యూ అధికారి పుల్లయ్య, నంద్యాల ఆర్‌డీఓ శ్రీనివాసులు వేర్వేరుగా మహానంది వచ్చారు. అలాగే విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఎస్పీ తిరుమలేశ్వరరెడ్డి, నంద్యాల డీఎస్పీ మహేశ్వరరెడ్డి దంపతులు స్వామివారి దర్శనార్థం వచ్చారు. మహానంది మండల అధ్యక్షురాలు బుడ్డారెడ్డి యశస్విని, సీతారామాపురం సర్పంచ్ బుడ్డారెడ్డి తేజస్వినిలు మహానందీశ్వరుడిని దర్శించుకుని పూజలు చేపట్టారు. వారికి ఆలయ అధికారులు స్వాగతం పలికి పూజలు నిర్వహింపచేశారు. అనంతరం వారికి స్వామి,అమ్మవార్ల ప్రసాదాలు అందించి వేదాశీర్వచనం చేశారు.

ఉత్సవాల ఏర్పాట్లను పరిశీలించిన డీసీ

దేవదాయశాఖ డిప్యూటీ కమిషనర్, చీఫ్ ఫెస్టివల్ ఆఫీసర్ రాణాప్రతాప్ శనివారం మహానందిలో శివరాత్రి ఏర్పాట్లు పరిశీలించారు. ఈఓ చంద్రశేఖర్ రెడ్డి, ఏఈఓ ఎర్రమల మధు, సూపరింటెండెంట్లు ఓంకారం వెంకటేశ్వరుడు, అంబటి శశిధర్‌రెడ్డిలతో వివిధ అంశాలపై చర్చించారు. వారి వెంట మద్దిలేటిస్వామి దేవస్థానం ఈఓ పాండురంగారెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

భక్తులకు త్వరితగతిన దర్శనం కల్పించండి



ఆలయప్రాంగణంలో పాగాలంకరణ ఏర్పాట్లును పరిశీలిస్తున్న కలెక్టర్ మనజీర్

శ్రీశైలంటెంపుల్: మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని మల్లన్న దర్శనార్థం వచ్చిన భక్తులందరికీ ఎలాంటి ఇబ్బందులు లేకుండా త్వరితగతిన స్వామివారి దర్శనం అయ్యేలా చర్యలు తీసుకోవాలని దేవస్థానం అధికారులను జిల్లా కలెక్టర్ మనజీర్ జిలానీ శామూన్ ఆదేశించారు. శనివారం జిల్లా ఎస్పీ రఘువీర్ రెడ్డి, జాయింట్ కలెక్టర్ కె.నిశాంతి, దేవస్థానం ధర్మకర్తల మండలి చైర్మన్ రెడ్డివారి చక్రపాణి రెడ్డి, ఈఓ ఎస్.లవన్నతో కలిసి క్షేత్రంలో పర్యటించారు. క్యూలైన్లలో పలు చోట్ల మంచినీటి కొరత ఉన్నట్లు భక్తులు కలెక్టర్ దృష్టికి తేగా యుద్ధప్రాతిపదికన మంచినీటి సదుపాయం కల్పించారు. అనంతరం అమ్మవారి ఆలయ ప్రాంగణం బ్రహ్మండరాయగోపురం, పాగాలంకరణ, స్వామిఅమ్మవార్ల కల్యాణోత్సవానికి చేసిన ఏర్పాట్లును పరిశీలించారు.

కల్యాణం.. కమనీయం



కల్యాణం నిర్వహిస్తున్న దృశ్యం

మిడుతూరు: స్థానిక శ్రీ పోతులూరి వీరబ్రహ్మేంద్ర స్వామి ఆలయంలో శనివారం మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకొని వీరబ్రహ్మేంద్రస్వామి, గోవిందమ్మవార్ల కల్యాణం శాస్త్రోక్తంగా, వేదమంత్రోచ్ఛరణల మధ్య కమనీయంగా సాగింది. ఆలయంలో ఉదయం స్వామివారికి అభిషేకం,కుంకుమార్చన, పుష్పార్చన తదితర విశేషపూజా దిత కార్యక్రమాలను వేదపండితులు సుబ్రహ్మణ్య శర్మ ఆధ్వర్యంలో వీరప్రవీణ్, శైలజ దంప తుల ఆధ్వర్యంలో శాస్త్రోక్తంగా నిర్వహించారు. అనంతరం కల్యాణం వైభవంగా జరిపించారు. భక్తులకు తీర్థ ప్రసాదాలతోపాటు అల్పాహారం ఏర్పాటుచేశారు. కార్యక్రమంలో గ్రామ పెద్దలు కాతా రామచంద్రారెడ్డి, మదన్‌మోహన్‌ఆచారి, రామ్మోహన్, నారాయణ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా మహాశివరాత్రి

మండలకేంద్రమైన మిడుతూరుతోపాటు పీరుసాహెబ్‌పేట, మాసపేట, నాగలూటి, పైపాలం, చెరుకుచెర్ల, రోళ్లపాడు, తలముడిపి, అలగనూరు, చౌట్కూరు, దేవనూరు తదితర గ్రామాల్లో మహాశివరాత్రి పర్వదిన వేడుకలు శనివారం ఘనంగా జరుపుకున్నారు. ఆయా గ్రామాల్లో వెలసిన శివాలయాలు భక్తులతో కిటకిటలాడాయి.

పకడ్బందీగా క్యూలైన్ల నిర్వహణ



క్యూలైన్ల వద్ద ఏర్పాట్లును పరిశీలిస్తున్న చైర్మన్

శ్రీశైలంటెంపుల్: మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుని లక్షలాదిగా తరలివచ్చిన భక్తాదులు పరమేశ్వరుడి దర్శనానికి బారులుదీరారు. వేకువజామున 2 గంటల నుంచే మల్లన్న దర్శనానికి భక్తులు తరలివచ్చారు. క్యూలైన్లలో భక్తులరద్దీ ఎక్కువగా ఉండడంతో ఎప్పటికప్పుడు దేవస్థానం ధర్మకర్తల మండలి చైర్మన్‌రెడ్డివారి చక్రపాణిరెడ్డి పర్యవేక్షణ చేపట్టి స్వయంగా వచ్చి భక్తులకు ఇబ్బందులు లేకుండా పరిశీలించారు. ఉచిత, శీఘ్ర,అతిశీఘ్ర క్యూలైన్ల భక్తులకు క్యూలలో ఎటువంటి తొక్కిసలాటలు లేకుండా క్రమపద్ధతితో ప్రణాళిక బద్ధంగా క్యూలైన్లను నిర్వహిస్తున్నారు. భక్తులందరికి స్వామివారి దర్శనం కలిగేలా ఆలయగర్భాలయంలో నాలుగు క్యూలను ఏర్పాటు చేసి దర్శనానికి అనుమతించారు. దీంతో భక్తులు ఎక్కువ సేపు క్యూలలో వేచి ఉండకుండా త్వరితగతిన దర్శనం కలిగే ఏపర్పాటు చేశారు. ధర్మకర్తల మండలి చైర్మన్ ఆలయ క్యూలైన్లు, కంపార్ట్‌మెంట్లు, మనోహర గుండం వద్ద రూ.500 ల క్యూలైన్‌ను పరిశీలించి అధికారులకు, సిబ్బందికి పలు సూచనలు చేశారు.



మహానందీశ్వరుడి దర్శనార్థం వచ్చిన విజిలెన్స్ ఎస్పీ తిరుమలేశ్వరరెడ్డి